క్లుప్తంగా

హిందూపురం 'వైకుంఠ పురం' కావాలి


ప్రసంగిస్తున్న భక్తవృంగదాస ప్రభు స్వామిజీ

హిందూపురం: 'హిందూపురం వైకుంఠ పురం కావాలి.. భగవద్గీత పఠనం జీవితాలను మార్చే ఔషధం.. మోక్ష ధ్యాన మార్గంలో నడిపిస్తూ కష్టనష్టల నుంచి బయటకు తెచ్చి జీవితాలను మార్చేస్తుంది' అని ఇస్కాన్ బెంగళూరు హరే కృష్ణ మూమెంట్ అధ్యక్షుడు భక్తవృంగదాస ప్రభు స్వామిజీ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవ వేడుకలు పురస్కరించుకుని హిందూపురం విడిరోడ్ వాసవీ ధర్మశాలలో బెంగళూరు ఇస్కాన్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన శ్రీకృష్ణుడి ప్రతిమను కొలువుదీర్చి 108 రకాల పిండి వంటకాలతో నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ కృష్ణుడు జన్మ గురించి తెలుసుకున్న ఏ జీవుడైనా శరీరం వదిలిన తర్వాత స్వర్గాన్ని చేరుతాడన్నారు. భక్తులు భగవద్గీత ప్రచారం కోసం సనాతన ధర్మంలో భాగస్వామ్యులవ్వాలన్నారు. అనంతరం ప్రత్యేక హారతి, శ్రీకృష్ణుడి కథ, సాంస్కృతి కార్యక్రమాలతో పాటు ఉయ్యాల సేవా నిర్వహించారు.

లేపాక్షి ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోండి

హిందూపురం అర్బన్: లేపాక్షి ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్‌కు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ విన్నవించారు. సోమవారం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆయన సీఐని మర్యాదపూర్వకంగా కలిశారు. లేపాక్షి ఆలయాన్ని సందర్శించి భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. నంది వద్ద ఏర్పాటు చేసిన టూరిజం అవుట్ పోస్టులో సిబ్బంది ఉండేలా చూడటమే కాకుండా పర్యాటక అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గోరంట్ల: మండల పరిధిలోని కరావులపల్లి గ్రామంలో దాతలు, గ్రామస్తుల సహకారం తో నిర్మిస్తున్న కరావులీశ్వర ఆలయ నిర్మాణానికి కరావులపల్లికి చెందిన రేపటి జయరామిరెడ్డి కుమారుడు బయపరెడ్డి సోమవారం రూ.50 వేల విరామిచ్చారు. ఆ మొత్తాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, గొల్లశ్రీరాములు, అశ్వర్థరెడ్డి, కృష్ణారెడ్డిలకు అందజేశారు.

బోజబండేశ్వర స్వామికి పూజలు


అలంకరణలో బోజ బండేశ్వర స్వామి

గుడిబండ: శ్రావణ సోమవారం సందర్భంగా మండల కేంద్రం పొలిమేరల్లో వెలసిన బోజబండేశ్వర ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుని, స్వామివారి ఆశీస్సులు పొందారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

చోళమాంబదేవికి హారతులు


హారతులు తీసుకెళ్తున్న మహిళలు

అమరాపురం: మండల పరిధిలోని మద్దనకుంటలో భక్తులు శ్రావణ సోమవారం పురస్కరించుకుని అమరాపురంలో వెలసిన చోళమాంబదేవికి హారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళాతాళాలతో అమరాపురం నుంచి మద్దనకుంటకి తీసుకొచ్చారు. అనంతరం మహిళలు జ్యోతులను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయండి

పెనుకొండ: నాసిన్, బెల్ పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పెనుకొండలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పాలసముద్రం వద్ద నిర్మించిన నాసిన్, నిర్మించబోయే బెల్ పరిశ్రమల కోసం పాలసముద్రం, చినబాబయ్యపల్లి, కావేటి నాగేపల్లి గ్రామాలకు చెందిన రైతులు భూములను ప్రభుత్వం తీసుకున్నా పరిహారం చెల్లింపులో న్యాయం జరగలేదన్నారు. వెంటనే వారికి తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు.



వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారాన్ని తలచుకుంటేనే భయంగా ఉంది. రొళ్ల సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించాలి. సీహెచ్‌సీ ఆవరణలో సీసీ కెమెరాలు లేవు. భవనంపై భాగాన ఖాళీ స్థలాన్ని ఇనుప కంబీలతో మూసివేయాలి. ఖాళీ స్థలం ఉండటంతో రాత్రివేళల్లో బయట నుంచి లోపలికి వచ్చే అవకాశం ఉంది. అలాగే సీసీ కెమెరాను ఏర్పాటు చేయాలి. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తప్పనిసరిగా అమలు చేస్తే వైద్య రంగంలో సేవలు అందిస్తున్న వారికి మరింత భద్రత ఉంటుంది.

– వెంకటలక్ష్మి, స్టాఫ్‌నర్స్, సీహెచ్‌సీ, రొళ్ల





కఠిన చట్టాలు అమలు చేయాలి

కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యాచారం ఘటన దేశానికి మాయని మచ్చ. సేవలందించే వైద్యసిబ్బందిపై దాడులు జరుగుతుండటం దారుణం. నేను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. విధుల్లో ఉన్నప్పుడు మందుల కోసం ఎంతో మంది వస్తుంటారు. కోల్‌కత్తా లాంటి ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను అమల్లోకి తీసుకురావాలి. హాయిగా విధులు నిర్వర్తించి ఇంటికి వెళతాము.

– వనజ, ఫార్మసిస్ట్, హేమావతి పీహెచ్‌సీ


హిందూపురం: 108 రకాల పిండి వంటకాలను శ్రీకృష్ణుడికి నైవేద్యంగా సమర్పించిన దృశ్యం


మడకశిర మండలం గౌడనహళ్లిలో కలశ ఉత్సవంలో పాల్గొన్న మహిళలు


మడకశిర మండలం ఛత్రంలో వేణుగోపాలస్వామిని ఊరేగిస్తున్న భక్తులు


హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహం

కృష్ణం వందే జగద్గురుమ్

- వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు
- రాధాకృష్ణుల వేషధారణలతో చిన్నారుల సందడి

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ముఖ్యంగా వైష్ణవాలయాలు సోమవారం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి. శ్రీకృష్ణ భగవానుడి చిత్రపటాలు, విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఆయా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. హరే కృష్ణ .. హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ .. హరే హరే అంటూ కృష్ణ నామస్మరణ చేశారు. ఆలయ కమిటీలు, యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. సామూహిక గీతాపారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు

– సాక్షిబృందం


హిందూపురం: పట్టణంలో వేణుగోపాలస్వామి రథోత్సవం


పెనుకొండ: వేణుగోపాలస్వామి ఆలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి సవిత


రొళ్ల: కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు


అమరాపురం మండలం గొల్లహట్టిలో వేణుగోపాలస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం


సోమందేపల్లి: కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

'మా భూములు ఆక్రమించాలని చూస్తున్నారు'

సోమందేపల్లి: పెనుకొండ బాబయ్యస్వామి వంశీయులైన తమకు హక్కు కలిగిన జాగీర్దార్ భూములను కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని భూయాజమానులు ఇబ్రహీం, మహబూబ్‌బాషా, షా ఫరీద్ తెలిపారు. ఆదివారం వారు సోమందేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. నడింపల్లి పంచాయతీ పరిధిలోని 373 సర్వే నంబర్‌పైకి 434 ఎకరాలు భూమి ఇనామ్ భూమి ఉందన్నారు. గతంలో నెల్లూరు సెటిల్మెంట్ కోర్టు ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలు హక్కు కలిగి ఉన్నామన్నారు. 1994లో నకిలీ పట్టాలు పొందగా అప్పట్లో తాము హైకోర్టును ఆశ్రయించగా పట్టాలు రద్దుతో పాటు అప్పటి తహసీల్దార్ సస్పెండ్ అయ్యారన్నారు. అయితే మూడు నెలలుగా కొందరు తమపై దుష్ప్రచారం చేస్తూ ఇనాం భూములు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోలేపల్లి నర్సింహులు మాట్లాడుతూ తనకు చట్టబద్ధంగా భూములు ఉంటే రాజకీయంగా దెబ్బతీయడానికి కొంతమంది టీడీపీ నాయకులు తెర వెనుక ఉంటూ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.


విలేకరులతో మాట్లాడుతున్న జాగీర్దారులు

జయచంద్రకు వేమన సాహితీ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కోగిర జయచంద్ర

పెనుకొండ: పట్టణానికి చెందిన ప్రముఖ హాస్య, మిమిక్రీ కళాకారుడు కోగిర జయచంద్రకు వేమన సాహితీ పురస్కారం లభించింది. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న కటారుపల్లిలో వేమన సాహితీయాత్ర కార్యక్రమం జరిగింది. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాష ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, కళాకారుల చేతుల మీదుగా జయచంద్ర వేమన సాహితీ పురస్కారం అందుకున్నారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తాం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానందస్వామి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్ ఆవరణలో పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి అందించిన మహాగని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రామానందస్వామి మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ భవనానికి అవసరమైన పెయింటింగ్ చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు రామాంజినేయులు, గౌరవాధ్యక్షుడు రామ్‌ప్రసాద్, ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కోశాధికారి ఫణి, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు షబ్బీర్, సీనియర్ పాత్రికేయులు ప్రకాష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ పరిధిలోని బెహలూల్‌సా దర్గా సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పద్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. రొద్దం మండలం బొక్సంపల్లికి చెందిన నారాయణ అయన భార్య పద్మ సోమందేపల్లి నుంచి బైక్‌లో వెళుతుండగా వెనుక నుంచి బొలెరో వాహనం ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన పద్మను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ రమేష్ తెలిపారు.

ఆగని మట్టి దందా

పరిగి: మండల చెరువు కింద సాగుబడి పట్టాలిచ్చిన వ్యవసాయ పొలాలను కూడా టీడీపీ నాయకులు వదలడం లేదు. పరిగి చెరువులో దళితుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూములను కొల్లగొడుతున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లతో, పదుల సంఖ్యలో జేసీబీ యంత్రాల సాయంగా మట్టిని తవ్వి జేబులు నింపుకుంటున్నారు. గతంలో మట్టి తరలింపుకై ఇరిగేషన్‌శాఖ అధికారులు అనుమతులు ఇచ్చి, కేవలం ప్రభుత్వ పనిదినాలలో తోలుకోవచ్చన్న నిర్ధిష్ట గడువు విధించినప్పటికీ అవేమీ లెక్కచేయని టీడీపీ నాయకులు దళితుల భూముల్లో ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వుతున్నారు. మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


దళితుల భూముల్లో మట్టి తవ్విన దృశ్యం

ఏడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి: మండలంలో సోమవారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఏకంగా ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. సోమవారం సెలవు దినమైనప్పటికీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో సిబ్బందితో కలసి నేతులపల్లి జయమంగళీ, పెన్నా నదుల సంగమం వద్ద దాడులు చేపట్టామన్నారు. ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశామన్నారు.

రొద్దంలో రెండు...

రొద్దం: మండల పరిధిలోని పి రొప్పాల గ్రామం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఆదివారం రాత్రి రెండు ట్రాక్టర్లు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పి. రొప్పాల, పి.కొత్తపల్లి గ్రామాలను చెందిన కొందరు పెన్నానది నుంచి అనుమతులు లేకుండా రాత్రి వేళ ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిస్తునట్లు ఎస్‌ఐ వలీబాషా తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేసి, ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి పెద్దనపల్లి క్రాస్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ముందు వెళుతున్న ఓల్వో బస్సును వెనుక నుంచి లారీ బలంగా ఢీకొంది. ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మునీర్ అహ్మద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వీరాపురంలో...

మండలంలోని వీరాపురం కల్లు దుకాణం సమీపంలో ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో అదే గ్రామానికి చెందిన గౌతమి, ప్రజ్వల్‌కు గాయాలయ్యాయి. వారు కర్ణాటకకు చెందిన వ్యక్తులు కాగా, ఉదయాన్నే కల్లు తాగేందుకు వీరాపురం వచ్చినట్టుగా తెలుస్తోంది.

వ్యక్తికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన శివప్ప

మడకశిర: పట్టణ పరిధిలోని చంద్రమౌళేశ్వర దేవాలయం సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... పట్టణ పరిధిలోని చౌటిపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ శివప్ప ఆమిదాలగొంది వైపు నుంచి మడకశిరకు ద్విచక్రవాహనంలో వస్తుండగా శివాలయం వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. వెంటనే 108 వాహనంలో మడకశిర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

చేనేత కార్మికుడిపై దాడి

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో చేనేత కార్మికుడిపై దాడి జరిగింది. వెంకటాపురం గ్రామానికి చెందిన మురళీ చోళసముద్రంలో మగ్గం పని చేస్తున్నాడు. అయితే సోమవారం మధ్యాహ్నం భోజనం చేయడానికి తన సొంతూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా కర్ణాటకలోని దాళవాటంకు చెందిన నటరాజ్ అనే వ్యక్తి వెనుక వైపు వచ్చి కట్టితో తలపై మోదాడు. దీంతో రక్త గాయాలైన మురళీని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా .. నటరాజ్‌కు మతిస్థిమితం లేదని, గౌరీబిదనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆస్పత్రి నుంచి పరారై దాడికి పాల్పడినట్లు అతని బంధువులు పోలీసులకు తెలిపారు.

ప్రముఖ పట్టుచీరల వ్యాపారి లక్ష్మీనారాయణ మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

హిందూపురం/హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన పట్టు చీరల వ్యాపారి, ప్రముఖ వ్యాపార వేత్త పల్లా లక్ష్మీ నారాయణ (74) అనారోగ్యంతో సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన హ్యాండ్ లూమ్, పవర్ లూమ్స్ మగ్గాలు నిర్వహించేవారు. ఆయన పరిశ్రమలో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. లక్ష్మీనారాయణకు భార్య, ముగ్గురు కుమారులు కాగా ఏడాది క్రితం ఆయన భార్య భారతమ్మ మృతి చెందారు. ఒక కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మరో ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతిపై పట్టణంలోని ప్రధాన పార్టీ నాయకులు, ప్రముఖులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వీరంగం


అంగన్‌వాడీ కేంద్రంలో పడేసిన కర్ణాటక మద్యం ప్యాకెట్లు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి అంగనవాడీ కేంద్రం -2లో ఆదివారం రాత్రి తాగుబోతులు చొరబడి చిన్నారుల ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం అంగనవాడీ కేంద్రానికి వెళ్లిన సిబ్బంది విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గ్రామానికి చెందిన నలుగురు యువకులు ఈ ఘటనకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ కావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆదివారం రాత్రి పొద్దు పోయేంత వరకూ మద్యం సేవించిన అనంతరం తాళాలను బద్ధలుగొట్టి లోపలికి ప్రవేశించి, పౌష్టికాహార పదార్థాలను చెల్లాచెదురుగా పడేసి, గ్యాస్ సిలిండర్‌తో పాటు ఆహార పదార్థాలను అపహరించుకెళ్లినట్లుగా అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.